కనగల్‌ను మరింత అభివృద్ధి చేస్తా



అయిలేటి వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్: కనగల్ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం కనగల్ మండల పరిధిలోని దర్వేశిపురం పుష్కరఘాట్ వద్ద అయిలేటి వాగుపై రూ.12.40కోట్లతో నిర్మించనున్న హై లెవల్ వంతెన, రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోరెపల్లి క్రాస్ రోడ్డు నుంచి రేగట్టె గ్రామం వరకు డబుల్ లేన్ రోడ్డు, లచ్చుగూడెం స్టేజీ నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా దర్వేశిపురం ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆరు గ్యారంటీల అమలు, ప్రజాపాలనే లక్ష్యంగా ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల సమస్యలు పరిష్కారించేలా శ్రమిస్తామన్నారు. వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని గుత్తేదారుకు మంత్రి సూచించారు. త్వరితగతిన వంతెన పనులు పూర్తిచేయించే విధంగా అధికారులు చూడాలన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. అభివృద్ధి పనుల్లో అక్రమాలు, అవినీతి లేకుండా చూడాలన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు దర్వేశిపురం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అదేవిధంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మొహన్‌రెడ్డి, ఎంపీపీ కరీం పాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, దర్వేశిపురం ఆలయ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచులు పూలమ్మ, అంజమ్మ, ఎంపీటీసీ శైలజ, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



మంత్రి కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు ఎన్నమల్ల అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కంచి మధుసూదన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే నల్లగొండ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడాన్ని హర్షిస్తూ మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తల్లమల్ల యాదగిరి, చింతపల్లి లింగమయ్య, రేఖల సైదులు, గాదరి రవి, బోగరి భిక్షం, తలమల జనార్దన్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

శాలిగౌరారం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. సీఐ రాఘవరావు, ఎస్ఐ సతీష్ పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో డీఎస్పీ పరేడ్ చేయించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ డివిజన్‌లో నేరాల నమోదు గతం కంటే 5 నుంచి 8 శాతం తగ్గిందన్నారు. నేరాలను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, సైబర్ నేరాల నివారణకై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శాలిగౌరారం మండలంలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించామని, ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా దర్యాప్తు చేసి నివేదికలను అందజేయాలని సూచించారు. విధి నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

సమాజ సేవకు పునరంకితం కావాలి

- రిటైర్డ్ డీఎస్పీ బండారు ధనుంజయ్యగౌడ్



మాట్లాడుతున్న ధనుంజయ్యగౌడ్

శాలిగౌరారం: సమాజ సేవకు ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటం గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ బండారు ధనుంజయ్యగౌడ్ అన్నారు. శాలిలిగోటం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ధనంజయ్యగౌడ్ కుటుంబానికి చెందిన రెండు గుంటల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు శనివారం గ్రామంలో ఆయన కుటుంబ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఎంత ఉన్నత స్థితిలో ఉన్నా పుట్టిన ఊరుకు ఎంతో కొంత మేలు చేయాలని అన్నారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శాలిలింగోటం గ్రామానికి తమ కుటుంబం మొదటి నుంచి అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, తన కుమారుడి జ్ఞాపకార్థం రెండు దశాబ్దాల క్రితమే శాలిగౌరారం పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థలాన్ని కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. అనంతరం ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాక మౌనిక యాదయ్య, ఎంపీటీసీ పాక రాములు, సింగిల్‌విండో డైరెక్టర్లు వంగూరి కవిత, రస్తాపురం సోమయ్య, ఆడిటర్ పాక గిరి, కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు లోడె నత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు బండారు వేణు, పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డుసభ్యులు, ఆయా పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ: పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ డి. శంకరయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొల్లగూడ, పెద్దబండ, కలెక్టర్ కార్యాలయం, మిర్యాలగూడ రోడ్డు, శాంతినగర్, హైదర్‌ఖాన్ గూడ, ఆర్టీసీ కాలనీ, సాగర్ రోడ్డు, రూరల్ పోలీస్ స్టేషన్, తెలంగాణ కాలనీ, హిమగిరి కాలనీ, శ్రీనివాస కాలనీ, సతీష్‌నగర్, బస్టాండ్, బోయవాడ ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా ఆదినారాయణ



ఆదినారాయణ

రామగిరి(నల్లగొండ): బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా జెల్లా ఆదినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ చేతులమీదుగా శనివారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. బీసీ కులాల ఐక్యత, బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషిచేస్తానని ఆదినారాయణ తెలిపారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

చండూరు(గట్టుప్పల్): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని గట్టుప్పల్ మండల కాంగ్రెస్ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శనివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తే వెనుకబడి ఉన్న మునుగోడు ప్రాంతం అభివృద్ధి జరిగే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భీమగాని మల్లేష్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పగిల్ల ఆది, ఎర్ర కుమార్, బండారు గోవర్ధన్, ఖమ్మం పాండు, పర్షనాయక్, దుబ్బాక సుధాకర్ తదితరులు ఉన్నారు.


నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని టీఎన్జీఓస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఉమ్మడి జిల్లా ఈఎస్ఐ డిపార్ట్‌మెంట్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ సాజిద్ హైదర్, కార్యదర్శిగా మర్రి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సీహెచ్. బాలనర్సింహ, కార్యవర్గ సభ్యులుగా డి. విష్ణువర్ధన్, ఎం. చంద్రకళ, టి. సుమతి, వి. ప్రియాంక, బి. స్వరూప, పి. రమేష్‌రెడ్డి, ఎ. నాగమణి, ఎం. చిన మల్లయ్య, జి. యాదగిరి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను టీఎన్జీఓస్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, మేడి జయరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన 'మౌంట్‌ఫోర్డ్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల

రామగిరి(నల్లగొండ): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో నల్లగొండ పట్టణంలోని మౌంట్‌ఫోర్డ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. చిత్రలేఖనం పోటీల్లో ఏడో తరగతికి చెందిన ఎం. తేజల్ ప్రథమ స్థానం, జి. సాయి జత్విక ద్వితీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో ఐదో తరగతి పి. వీక్ష తృతీయ స్థానం, మూడో తరగతికి చెందిన ఎస్. శృతికారెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హరి చందన, ఎస్పీ చందనా దీప్తి చేతుల విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్లాంకెట్లు అందజేత

నల్లగొండటౌన్: జాతీయ బాలికల సంరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో వివిధ ఆస్పత్రుల్లో చిన్నారులు, బాలికల కుటుంబాలకు బ్లాంకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అనితారాణి, రమేష్, ప్రవీణ్, పుల్లారావు, వసంతకుమారి, రాజేశ్వరి, విశ్వజ్యోతి, గౌరిశ్రీ, త్రివేణి, ఉదయశ్రీ, సింధూర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ చందనా దీప్తి



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

- ఎస్పీ చందనా దీప్తి

రామగిరి (నల్లగొండ): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ 59వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా థామస్‌రెడ్డి, బ్రదర్ జోస్ డేనియల్‌ను సన్మానించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ బ్రదర్ హృదయ్‌కుమార్‌రెడ్డి, రెవరెండ్ బ్రదర్ మోంట్ ఫోర్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ బాల ఇన్నా, బ్రదర్ చాకో, బ్రదర్ పీటీ జోసెఫ్, జి. జయబాబు, వి.రవికాంత్, లూర్దు రెడ్డి, బాలశౌరిరెడ్డి, జయప్రకాశ్, జయంత్, క్యాథరిన్, సుందరమ్మ, నిర్మల, పర్వీస్ పాల్గొన్నారు.

సర్పంచ్ పదవి గౌరవప్రదమైనది

రామగిరి(నల్లగొండ): సర్పంచ్ పదవి గౌరవప్రదమైనదని జెడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి అన్నారు. శనివారం తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ గ్రామానికి ప్రథమ పౌరుడిగా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటుపడతాడన్నారు. కొంతమంది సర్పంచులు నిధులు రాకున్నా తమ సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన బకాయిలను చెల్లిస్తామన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల వారీగా ఓవర్ లోడ్ సమస్యలను గుర్తించి నివేదిక సమర్పించాలని విద్యుత్ ఏఈని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందేలా ఎంఈఓ పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచులను సన్మానించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, వైస్ ఎంపీపీ ఏనుగు వెంకట్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీఓ నరసింహస్వామి, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



నాంపల్లిలో ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నాంపల్లి: ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆక్రమణకు గురవుతున్న నాంపల్లి మండల కేంద్రంలోని ఉద్యోగుల స్థలం, చిట్టంపహాడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, ఎస్సీ కమ్యూనిటీ స్థలాలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి ఆక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్రమణకు గురవుతున్న స్థలాల గురించి కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ, ఉపాధ్యాయులు సిలువేరు నారాయణ, అనిల్, కృష్ణయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

'కామినేని' ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం

కనగల్: నార్కట్‌పల్లిలోని కామినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆధ్వర్యంలో కనగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏవిధంగా బ్రష్ చేసుకోవాలి, పళ్ల సమస్యలు ఉన్నప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను వైద్యులు వివరించారు. ఉచితంగా దంత వైద్య శిబిరం నిర్వహించినందుకు గాను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం కామినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శృతి, హరిక, రష్మిత, వర్ష, శ్రీజ, పీఆర్‌ఓ చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. వెంకటరావిఎరెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

చిట్యాల: పట్టణంలోని లొయోలా టెక్నో స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ జమీరొద్దీన్ అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎన్ఎఫ్. సుందర్‌రాజ్, డైరెక్టర్లు కిరణ్, వెంకన్న, శ్రవణ్, కౌన్సిలర్ రెముడాల లింగస్వామి, టీచర్లు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

మిర్యాలగూడ: పట్టణ పరిధిలోని నందిపాడులో గల తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలో వివిధ రకాల అపరాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని సంస్థ రీజినల్ మేనేజర్ సీహెచ్.కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ కే6 విత్తనాలు 30కేజీల బ్యాగ్ రూ.2,865, శనగ విత్తనాలు 25కేజీలు రూ.1,875, మినుములు 4కేజీలు రూ.424లకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు నందిపాడు కార్యాయలంలో సంప్రదించి విత్తనాలు పొందాలని కోరారు.

బీఆర్ఎస్ సర్పంచులకు సన్మానం



సర్పంచులను సన్మానించిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కనగల్: ఈ నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగియనుండటంతో శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో కనగల్ మండల బీఆర్ఎస్ సర్పంచులను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పల్లెలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాయన్నారు. దేశానికే తెలంగాణలోని గ్రామ పంచాయతీలు ఆదర్శంగా నిలిచాయన్నారు. జీవితంలో పదవులు శాశ్వతం కాదని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మంచి పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరీం పాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంజీవ, మాజీ ఎంపీటీసీ సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి సర్పంచులు అయితగోని యాదయ్యగౌడ్, కడారి కృష్ణయ్య, కారింగు పార్వతమ్మజానయ్యగౌడ్, ఆవురేశి క్రాంతిశ్రీనివాస్, చింతల యాదగిరి, పూలమ్మ, కరుణశ్రీ, రాజేశ్వరి, గంగమ్మ చంద్రయ్య, ధనమ్మసైదులు, రామలచయ్య, కోటేశ్, కళావతి తదితరులున్నారు.

తాళ్లవెల్లెంల సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు..



తాళ్లవెల్లెంల సర్పంచ్, పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి గత ఐదేళ్లుగా శక్తి వంచన లేకుండా కృషిచేశానని అన్నారు. ఇన్ని రోజులు తనకు సహకరించిన అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సర్పంచ్, పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పామనగుళ్ల అంజయ్య, పంచాయతీ కార్యదర్శి కర్నాటి మాధవరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు

నకిరేకల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సునీత ఈ పోటీలకు సంబంధించిన పరీక్షా పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్, ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శోభారాణి హాజరై మాట్లాడారు. ప్రథమ స్థానంలో నిలిచిన నోముల జెడ్పీ హైస్కూల్, ఎస్సీఆర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీటి సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, ప్రతినిధులు కుర్మిళ్ల శ్రీనివాస్, చల్లోజు శ్రీనివాస్, కోకిల, విజయలక్ష్మి, రాపోలు రఘు, కృష్ణ, మోహిని, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

చిట్యాల: మండల పరిధిలోని వెలిమినేడు గ్రామ పంచాయతీలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం రాత్రి వెలిమినేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం యమహేష్, ప్రజా సంఘాల నాయకులు అర్రూరి శ్రీను, దేశబోయిన స్వరూపనర్సింహ, పంది నరేష్, నాతి వెంకట్రామయ్య, సాయి విజయ్‌కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

నల్లగొండ: తెలంగాణ ఆల్ మైనార్టీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అశ్రఫ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి షేక్ ఫయాజ్ బాబా, ఉపాధ్యక్షుడు మహ్మద్ ఇంతియాజ్ అలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ రఫీ, మహ్మద్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

కేతేపల్లి: కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక క్రిష్ణ, రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వెంకులు, లూర్దుమారయ్య, వంగూరి వెంకన్న, ఇందిర, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కట్టంగూర్: మానవ అక్రమ రవాణాను అరికట్టడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీఓ అస్రా అంజుమ్ అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కట్టంగూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మానవ అక్రమ రవాణా, స్వరక్షా డే కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజీలు, కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొందరు ఉద్యోగ, సినిమా అవకాశాలు కల్పిస్తామని మహిళలను, యువతులను విదేశాలకు అమ్మేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారదారాణి, పద్మావతి, ఎస్ఓ నీలాంబరి, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, అనిల్ కుమార్, అంబర్‌సింగ్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గట్టుప్పల్‌లో..

చండూరు(గట్టుప్పల్): మహిళల అక్రమ రవాణాపై ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో గట్టుప్పల్ మండలంలోని తేరేట్‌పల్లి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు గౌరిగ సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య మాట్లాడుతూ.. గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీతాకృష్ణన్ ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ శాఖ, పోలీస్, విద్య, న్యాయశాఖ సహకారంతో ఇప్పటివరకు 28,200 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, యాదయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, సుజన, జ్యోతి, పెద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మైనార్టీ గురుకుల పాఠశాల తనిఖీ

నకిరేకల్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను శనివారం ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట సరుకులను తనిఖీ చేశారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం

కనగల్: మండల పరిధిలోని పానుగోడు గ్రామానికి చెందిన నాగమ్మ జి. యడవల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివింది. ఆమె తన భర్తతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటుంది. ఇటీవల నాగమ్మ భర్త అనారోగ్యానికి గురై మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగమ్మకు ఆమెతో పాటు పదో తరగతి చదివిన మిత్రులు శనివారం రూ.40,000 ఆర్థికసాయం అందజేశారు. ఆమెకు స్నేహితులు మనోధైర్యం చెప్పి భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

చిన్నారులకు పోషకాహారం ముఖ్యం

మర్రిగూడ: చిన్నారులకు తల్లిపాలతో పాటు పోషకాహారం అందించడం కూడా ముఖ్యమని మర్రిగూడ మండలంలోని కొండూరు గ్రామ సర్పంచ్ కుంభం నర్సమ్మమాధవరెడ్డి అన్నారు. శనివారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు బాల్యంలో అందించే పోషకాహారమే వారి ఎదుగుదలకు ఎంతో కీలకంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. మౌనిక, అంగన్‌వాడీ టీచర్ రాకొండ శోభ, ఏఎన్ఎం అరుణ, ఆశ కార్యకర్తలు వసంత, రాజీ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు అంతర్ముఖ యోగా శిక్షణ

చిట్యాల: శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29, 30వ తేదీల్లో చిట్యాలలో ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కుర్రె రవి, కూరెళ్ల యాదయ్య, రేగొండ వేణుమాధవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిట్యాల పట్టణంలోని వీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో భిక్షమయ్య గూరుజీ నేతృత్వంలో ఈ యోగా శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనుముల మండల వాసికి డాక్టరేట్

నల్లగొండటూటౌన్: అనుముల మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన ఆదిమల్ల బంగారయ్య భూగర్భ శాస్త్రంలో చేసిన పరిశోధనకు గాను హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ పీజీసెట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి పర్యవేక్షణలో 'హైడ్రో జియలాజికల్ అండ్ హైడ్రో జియో కెమికల్ ఇన్వెస్టిగేషన్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను తనకు డాక్టరేట్ లభించినట్లు శనివారం బంగారయ్య తెలిపారు.

బాలికలకు రక్తహీనత పరీక్షలు

నకిరేకల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో శనివారం ప్రభుత్వ వైద్య సిబ్బంది 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న బాలికలకు రక్తహీనత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుకన్య, హెల్త్ సూపర్‌వైజర్ అనిత, డాక్టర్లు మురళి, మనోహర్, రాజు, శోభారాణి, వైద్య సిబ్బంది షాజియా, మమత తదితరులు ఉన్నారు.